## క్లుప్తంగా

### అనారోగ్యంతో కానిస్టేబుల్ మృతి



పాన్‌గల్: మండల కేంద్రానికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ మహమ్మద్ గౌస్ (50) అనారోగ్యంతో శనివారం మృతిచెందాడు. మహబూబ్‌నగర్‌లో విధులు నిర్వహిస్తున్న గౌస్ కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంట్లోనే ఉంటున్నాడు. ఆరోగ్యం క్షీణించడంతో శనివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. బాధిత కుటుంబాన్ని ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్ గోపాల్‌రెడ్డి, రిటైర్డ్ ఆర్మీ జవాన్ ఆదాం రాజు పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

### పోలింగ్ బూత్‌లలో వసతుల పరిశీలన



అమరచింత: మండలంలోని పోలింగ్ బూత్‌లను అధికారులు శుక్రవారం సందర్శించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల గురించి ఆరా తీశారు. తరగతి గదులను పరిశీలించారు. తాగునీటితో పాటు విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్ల వసతులు ఎలా ఉన్నాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని మిట్టనందిమళ్ల, మస్తీపూర్, ఈర్లదిన్నె, చింతరెడ్డిపల్లి, కిష్టంపల్లి గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను శనివారం పరిశీలించారు. పాఠశాల ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించడమే కాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుద్ధ్య పనులు చేపడుతున్నామన్నారు.

### ఆత్మకూర్ వాసికి డాక్టరేట్



ఆత్మకూర్: సోషల్ సర్వీస్ విభాగంలో అత్యుత్తమ సేవలు అందించిన ఆత్మకూర్‌కు చెందిన రవిశేఖర్‌రెడ్డికి ఇంటర్నేషనల్ పీస్ సంస్థ వారు డాక్టరేట్ ప్రదానం చేశారు. జర్మనీ పరిశోధన విశ్వవిద్యాలయం వారు అందించే డాక్టరేట్‌ను పాండిచ్చేరిలో ప్రముఖ సంఘ సంస్కర్త రోహిణిదీక్షిత్ చేతుల మీదుగా అందుకున్నట్లు రవిశేఖర్‌రెడ్డి తెలిపారు. కరోనా సమయంలో వేలాది మంది నిస్సాహాయకులకు అన్నదానం, సొంత ఖర్చులతో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టిన తన సేవలు గుర్తించి డాక్టరేట్‌ను ఇవ్వడం సంతోషం కలిగించిదన్నారు. ఈ స్ఫూర్తితో మరిన్ని సేవా కార్యక్రమాల్లో పాల్గొంటానని తెలిపారు.

### కొవ్వొత్తుల ర్యాలీ



పెబ్బేరు రూరల్: మాజీ మంత్రి చిన్నారెడ్డి సూచన మేరకు మండల కాంగ్రెస్ నాయకులు ప్రవళిక మృతికి నిరసనగా పట్టణ కేంద్రంలో కొవ్వొత్తుల ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ ఎన్నో ఆశలతో నర్సంపేటకు చెందిన ప్రవళిక హైదరాబాద్ వచ్చి గ్రూప్–2 పరీక్షలకు సిద్ధమవుతుందని, కానీ ప్రభుత్వ అసమర్థ విధానాలతో పరీక్ష వాయిదా పడడంతో మనస్థాపానికి గురైన ఆమె ఆత్మహత్య చేసుకుందని వాపోయారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని వేడుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాములు యాదవ్, పట్టణ అధ్యక్షుడు కుమ్మరి గోవిందురాజ్, యువకులు పాల్గొన్నారు.

### ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన



పెంట్లవెల్లి: మండలంలోని గోపులాపూర్‌లో నాగార్జున కంపెనీ సేల్స్‌మెన్ దుర్గాప్రసాద్ రైతులకు ఎరువులు, క్రిమిసంహారక మందులపై అవగాహన కల్పించారు. పంటలకు నాణ్యమైన మందులు ఉపయోగించాలని సూచించారు. నాగార్జున కంపెనీ మందులు వినియోగిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో రైతులు, కంపెనీ యజమానులు పాల్గొన్నారు.

### ఇంటింటికీ బీఎస్పీ ప్రచారం



కొల్లాపూర్: పట్టణంలో బీఎస్పీ నాయకులు శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆ పార్టీ రాష్ట్ర ఈసీ మెంబర్ గగనం శేఖరయ్య కూలీలను, చిరు వ్యాపారులను కలిసి పార్టీ అధికారంలోకి వస్తే చేపట్టనున్న సంక్షేమ పథకాలను వివరించారు. టిఫిన్ సెంటర్ నిర్వాహకులతో ముచ్చటించారు. కరపత్రాలను పంచి పెట్టారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కారంగి బ్రహ్మయ్య, నాయకులు కాటం విష్ణుతేజ, పోతుగంటి బాలకృష్ణుడు ఉన్నారు.

# 'నిఘా' నిద్దరోతుంది!

- పనిచేయని సీసీ కెమెరాలు
- యథేచ్ఛగా రేషన్ బియ్యం అక్రమ రవాణా
- పట్టణంలో చోరీల నియంత్రణ ఏదీ?



అమరచింత గాంధీ విగ్రహం వద్ద ఎలక్ట్రికల్ స్తంభానికి ఏర్పాటు చేసిన కెమెర



రాజీవ్ చౌరస్తాలో..

అమరచింత: ఒక్క కెమెరా వంద మంది పోలీసులకు సమానమని, పగలు, రాత్రి అనే తేడా లేకుండా అన్ని దృశ్యాలను రికార్డు చేయాల్సిన కెమెరాలు మరమ్మతు కారణంగా నిద్దరోతున్నాయి. పట్టణంలో ఇసుక, రేషన్ బియ్యం అక్రమ రవాణాతో పాటు దొంగల ఆట కట్టించేందుకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. దీంతో అక్రమంగా రేషన్ బియ్యం, ఇసుకను తరలించి వ్యాపారం చేసుకునే వాళ్లకు మంచి అవకాశం దక్కింది.

**22 కెమెరాల ఏర్పాటు**

పట్టణంలోని ప్రధాన రహదారులతో పాటు ఆయా వీధుల్లో మొత్తంగా 22 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటితో పాటు మైక్ సిస్టం పెట్టడంతో ఎక్కడ ఏం జరుగుతుందో అన్న విషయాలను పోలీసు కంట్రోల్ రూం నుంచే పర్యవేక్షిస్తూ నిబంధనలు అతిక్రమించే వారికి అక్కడి నుంచే హెచ్చరికలు జారీ చేసే వాళ్లు. అలా ఆరు నెలల కాలం గడవక ముందే సీసీ కెమెరాల వైర్లు ఈదురు గాలులు, భారీ లోడ్‌తో వెళ్తున్న వాహనాలు తాకడంతో తెగిపడ్డాయి. దీంతో షార్ట్‌సర్క్యూట్ కారణంగా 22 సీసీ కెమెరాలు పనిచేయకుండా పోయాయి. రెండున్నరేళ్లుగా నిఘా నేత్రాలు మరమ్మతుకు నోచుకోలేక పోతున్నా సంబంధిత పోలీసు అధికారులు పట్టించుకోవట్లేదు. ప్రజల భాగస్వామ్యం ఉండాలని, వారు ఇచ్చే విరాళాలతో సీసీ కెమెరాలను మరమ్మతు చేయిస్తామని పోలీసులు చెప్పుకొస్తున్నారు.

**కంట్రోల్‌రూం నుంచే..**

బస్టాండ్ రహదారిలో ఆటోలు, టాటా ఏస్ వాహనాల డ్రైవర్ల ఆగడాలను సైతం కంట్రోల్‌రూం నుంచే నియంత్రించే వాళ్లు. కానీ ప్రస్తుతం సీసీ కెమెరాలు పనిచేయడం లేదని తెలిసి పోవడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రతరం అయినా పట్టించుకునే అధికారులే కరువయ్యారు.

**ఎన్నికల సమయంలో..**

ప్రస్తుతం అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన వేళ పట్టణంలో నిబంధనలు అతిక్రమించే వారి వివరాలను తెలుసుకునే వీలు లేకుండా పోతుంది. రాత్రివేళ ఓటర్లకు ఇచ్చే ప్రలోభాలను సైతం నియంత్రించే అవకాశం లేకపోతుందని పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే సీసీ కెమెరాలను పునరుద్ధరించి ఎన్నికల వేళ గస్తీ ముమ్మరం చేయాలని పలువురు కోరుతున్నారు.

**దాతల సహకారం కోరుతున్నాం**



పట్టణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు కొన్ని నెలలుగా షార్ట్‌సర్క్యూట్ కారణంగా మరుగున పడ్డాయి. వీటికి మరమ్మతు చేపట్టడానికి పట్టణానికి చెందిన దాతలు సహకరించాలని కోరుతున్నాం. రాత్రి శల పట్టణంలో పెట్రోలింగ్ పెంచుతున్నాం. అక్రమ రేషన్ బియ్యం రవాణాపై దృష్టి సారించాం. త్వరితంగా సీసీ కెమెరాలను మరమ్మతు చేపడతాం.

– జగన్మోహన్, ఎస్‌ఐ, అమరచింత

# ఆలయాల్లో అమావాస్య పూజలు



అమరచింత శివచౌడేశ్వరి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

అమరచింత: అమావాస్యను పురస్కరించుకొని శనివారం మండలంలోని ప్రధాన ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పట్టణంలోని శివ చాముండేశ్వరి ఆలయంతో పాటు వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలతో పాటు భక్తులకు అన్నదానం చేశారు. నాగల్‌కడ్మూర్‌లోని దేవేంద్రచారి మఠంలో ప్రత్యేక పూజలతో పాటు అన్నదానం నిర్వహించారు. చంద్రగఢ్ కోటపై వెలసిన శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా చర్యలు తీసుకున్నారు.

**అన్నదాన కార్యక్రమం**

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని వీరన్న గుట్టపై వెలిసిన భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయం వద్ద శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త కమ్మరి గోపి ఆధ్వర్యంలో ఉదయం నుంచి గుట్టపై ఉన్న దేవాయంలో స్వామి వారికి అభిషేకం తదితర ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గుట్ట కింది భాగాన అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని దాత మండలంలోని వెంకటాంపల్లికి చెందిన మోడల పురుషోత్తం చేశారు.



పెబ్బేరులో..

పెబ్బేరు రూరల్: అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకొని వనపర్తి మండలంలోని చింతల ఆంజనేయస్వామి ఆలయంలో పల్లకీ సేవ, అభిషేకాలు జరిపించారు. ఆలయం వద్ద దాతలు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పూజల్లోలు బృందావన్ పెట్రోల్ పంపు చందు, గోకారం, రాజు, చిట్యాల నరసింహ, పసుపుల మహేష్, సత్యనారాయణ, భక్తబృందం పాల్గొన్నారు.

**పెబ్బేరు మండలంలో..**

మండలంలోనిని ప్రసిద్ధి గాంచిన ఆంజనేయ స్వామి ఆలయాలలో అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులు పూజలు నిర్వహించారు. పెబ్బేరు ఆంజనేయ స్వామి ఆలయంలో వంగూరు ప్రమోద్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.

## క్రీడా స్ఫూర్తి ప్రదర్శిస్తేనే ఉత్తమ ఫలితాలు



కొర్లకుంటలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ కమలేశ్వర్‌రావు



బుద్దారంలో కబడ్డీ ఆడుతున్న విద్యార్థినులు

వీపనగండ్ల: క్రీడల్లో పాల్గొనే యువకులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించినప్పుడే ఉత్తమ ఫలితాలు వస్తాయని ఎంపీపీ కమలేశ్వర్‌రావు అన్నారు. శనివారం కొర్లకుంటలో పానుగంటి వారి ప్రోత్సాహంతో కొర్లకుంట యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువత చెడు వ్యసనాలకు ఆకర్షితులు కాకుండా క్రీడల్లో తమ నైపుణ్యాన్ని పెంచుకోవడం, విద్యా, ఉద్యోగాల్లో ఉన్నతంగా రాణించాలని సూచించారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో జరిగే ఈ క్రికెట్ పోటీలో 40 జట్లు పాల్గొన్నాయి. మొదటి బహుమతిగా రూ.30 వేల నగదు, రెండో బహుమతిగా రూ.20 వేలు, మూడో బహుమతిగా రూ.10వేల నగదు ప్రోత్సాహకాన్ని పానుగంటి వారి సహకారంతో క్రీడాకారులకు అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు సత్యనారాయగౌడ్, కార్తీక్‌రావు, కృష్ణ, నిర్వాహకులు తిరుపతినాయక్, నరేష్‌నాయక్, మధు తదితరులు పాల్గొన్నారు.

**రెండో రోజు కొనసాగిన పోటీలు**

గోపాల్‌పేట: మండలంలోని బుద్దారం గురుకుల పాఠశాల మైదానంలో రెండో రోజు శనివారం అథ్లెటిక్స్ గేమ్స్‌లో భాగంగా హైజంప్, లాంగ్ జంప్, షార్ట్‌పుట్, డిస్కస్ త్రో, 100, 200, 400 మీటర్లు, మూడు కిలో మీటర్ల పరుగుపందెం నిర్వహించారు. అనంతరం కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాట్మింటన్, బాల్‌బ్యాట్మింటన్, టెన్నికాయిట్ గేమ్స్ రెండో రౌండ్ ఆడించారు. అండర్–17, అండర్–14లో బుద్దారం గురుకుల పాఠశాల విద్యార్థినులు ఫైనల్‌కు చేరినట్లు నిర్వాహకులు తెలిపారు.

### మద్యం పట్టివేత: కేసు నమోదు

పాన్‌గల్: రేమద్దులలోని పద్మ కిరాణం షాపులో అక్రమంగా అమ్మకానికి ఉంచిన 24 బీర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ వేణు శనివారం పేర్కొన్నారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం ఎన్నికల కోడ్ నేపథ్యంలో శుక్రవారం రాత్రి రేమద్దులలో తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో పద్మ కిరాణం షాపులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించగా కింగ్ ఫిషర్ ప్రీమియర్ బీర్లు 16, కింగ్ ఫిషర్ స్ట్రాంగ్ బీర్లు 8 లభించడంతో వాటిని స్వాధీనం చేసుకొని పద్మపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ తెలిపారు.

**సారా విక్రేతపై..**

వీపనగండ్ల: మండలంలోని బొల్లారంలో పసుల శాంతమ్మ సారాను విక్రయిస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవి ప్రకాష్ తెలిపారు. మండలంలో అక్రమంగా సారాను తయారు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఎన్నికల నిబంధనను అనుగుణంగా గ్రామాల్లోని రాజకీయ పార్టీల నాయకులు తమతమ ప్రచార కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు.

### ఇసుక తరలింపును అడ్డుకున్న రైతులు

అడ్డాకుల: మండలంలోని కన్మనూర్ గ్రామశివారులో పెద్దవాగు నుంచి ఇసుక తరలింపును శనివారం కొకుంట్ల మండలం రేకులంపల్లి గ్రామ రైతులు అడ్డుకున్నారు. ఇటీవల ప్రభుత్వ అవసరాలకు వాగులో ఇసుక తవ్వకాలు చేపట్టారు. వాగులో ఇసుక తరలింపుతో వ్యవసాయ బోరుబావులు ఎండిపోతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. వాగులో శివారు హద్దులు చూయించకుండా తవ్వకాలు చేపడుతున్నారని ఆరోపించారు. సమాచారం అందుకున్న ఆర్‌ఐ సాహత్ ఇషాన్ అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడారు. ప్రభుత్వ అవసరాలకే ఇసుక తరలింపు చేపట్టామని వివరించారు. ఉన్నతాధికారులు ఆదేశిస్తే ఇసుక తరలింపును నిలిపేస్తామని, అప్పటి వరకు ఇసుక తరలింపును అడ్డుకోవద్దని సూచించడంతో రైతులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.



### ఎండుతున్న పంటలు



మాధవస్వామినగర్‌లో ఎండిపోతున్న మొక్కజొన్న పంట

పెంట్లవెల్లి: మండలంలోని జటప్రోల్, మాధవస్వామినగర్, మల్లేశ్వరం, కొండూరు గ్రామాలలో మొక్కజొన్న, మినుము, వరి పంటలను అత్యధికంగా రైతులు సాగు చేశారు. వర్షాలు సరిగ్గా కురువక పోవడంతో సాగు చేసిన పంటలు ఎండుతున్నాయి. దీనికి తోడు విద్యుత్ సరఫరాలో కోతలు విధిస్తుండటంతో ఉన్న పంటలు కూడా చేతికి రావడం లేదని రైతులు వాపోతున్నారు. కనీసం పెట్టుబడి కూడా రాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

### సైబర్ నేరగాళ్లతో అప్రమత్తం

పెబ్బేరు రూరల్: వనపర్తి పట్టణ పోలీస్ స్టేషన్‌లో సైబర్ నేరం కేసు నమోదైనట్లు ఎస్‌ఐ యుగంధర్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల మేరకు వనపర్తి పట్టణంలోని రాయిగడ్డకు చెందిన నారాయణ దాస్ రంజిత్‌కుమార్‌కు ఈ నెల 1న వాట్సాప్‌లో ఆన్‌లైన్‌లో ఉద్యోగం చేసుకోవచ్చని ఓ మెస్సేజ్ వచ్చింది. యూట్యూబ్‌లో సబ్‌స్క్రైబ్ చేసుకుంటే డబ్బులు ఇస్తాం అని దాని సారాంశం. 3వ తేదీన గూగుల్‌పే ద్వారా రూ.117 ఇతడికి పంపారు. టెలిగ్రాం యాప్‌లో జాయిన్ అవ్వండి అని చెప్పారు. నిబంధనల ప్రకారం ట్రేడింగ్ చేయాలని సూచించారు. ఆ తర్వాత 4, 5 వ తేదీల్లో రూ.6,800 మొదలుకొని ఆరు సార్లు మొత్తం రూ 1.50 లక్షల వరకు వారికి నగదు పంపించాడు. తాను మోసపోయానని గుర్తించిన రంజిత్ తన డబ్బులు చెల్లించాలని వారిని కోరాడు. కానీ సైబర్ నేరగాళ్లు ఇతడినే రూ3.33లక్షలు కట్టాలని చెప్పడంతో చేసేందేం లేక శనివారం వనపర్తి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, వాట్సాప్ మెసేజ్‌లకు స్పందించకూడదని సూచించారు.

## మహిళా రిజర్వేషన్ అమలు చేయాలి



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మహిళలు

పాన్‌గల్: మహిళా రిజర్వేషన్లను 2024లో వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అమలు చేయాలని కోరుతూ సీపీఐ అనుబంధ భారత జాతీయ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట మహిళలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు వంక గోపాల్, మహిళ సమాఖ్య నాయకురాలు కృష్ణవేణి మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదించడం వెనుక కుట్ర దాగి ఉందని ఆరోపించారు. మహిళల ఓట్లను దండుకునేందుకే బిల్లుకు ఆమోదం తెలిపినట్లు వారు పేర్కొన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే బిల్లును తెచ్చేవారని అలా కాకుండా ఎన్నికల్లో లబ్ధి పొందడానికే ఇప్పుడు చట్టం తెచ్చిందన్నారు. ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా రిజర్వేషన్లు వచ్చే 2024 ఎన్నికల్లో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ చట్టంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు సీట్ల రిజర్వేషన్లు లేవని ధనవంతులకు, రాజకీయ పలుకుబడి ఉన్న ఉన్నత వర్గాల మహిళలకే 33 శాతం రిజర్వేషన్లు దక్కుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చెన్నమ్మ, సుజాత, శివలీల, కురవమ్మ, వెంకటమ్మ, అలివేలు, వెంకటమ్మ, శంకరమ్మ, లక్ష్మి, కౌసల్య, బొక్కలమ్మ, బాలమశమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనలోనే సంక్షేమ ఫలాలు



కేశం నాగరాజుగౌడ్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆత్మకూర్: కాంగ్రెస్ పార్టీతోనే సుపరిపాలన సాధ్యమని, ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడం కాంగ్రెస్‌కే సాధ్యమనే విషయాన్ని ప్రజలు విశ్వసిస్తున్నారని టీపీసీసీ రాష్ట్ర కల్లుగీత కార్మిక చైర్మన్ కేశం నాగరాజుగౌడ్ అన్నారు. శనివారం ఆత్మకూర్‌లో మాజీ సర్పంచ్ మొగిలి గంగాధర్‌గౌడ్ నివాసంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పూల మాలలు, శాలువాలతో కేశం నాగరాజుగౌడ్‌ను కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు అమలు కానీ హామీలతో రాష్ట్ర ప్రజలను మోసం చేశారని ధ్వజమెత్తారు. దేశంలో మతకల్లోహాలు సృష్టిస్తూ వాట్సాప్ గ్రూపుల్లో అబద్ధపు ప్రచారం చేసి విషం చిమ్ముతున్నారని, దేశ సంపదను దోచి అదానీ, అంబానీలకు కట్టబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీళ్లు, నిధులు, నియమాకాల పేరిట ఏర్పడిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులను నిండా ముంచిందని, కేసీఆర్ కుటుంబానికే నియామకాలు జరిగాయని ధ్వజమెత్తారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాభవం ఎదురుకానున్నట్లు సర్వేల ద్వారా తెలుసుకుని బీఆర్‌ఎస్, బీజేపీ ఎంఐఎంతో జతకట్టి కాంగ్రెస్‌ను దెబ్బతీయాలని కుట్రలు పన్నుతున్న విషయాన్ని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.

**గెలుపే లక్ష్యంగా ముందుకెళ్తాం**

మక్తల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అధిష్టానం ఆదేశాల మేరకు నడుచుకుంటామని, టికెటఎవ్వరికి వచ్చినా అభ్యర్థి గెలుపే లక్ష్యంగా సమన్వయంతో ముందుకెళ్తామని ఆయన స్పష్టం చేశారు. ఆరు గ్యారెంటీ స్కీంలతో రాష్ట్ర ప్రజలకు ప్రయోజనం చేకూరనుందని తెలిపారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ.500లకే గ్యాస్ సిలిండర్, మహిళలకు ప్రతినెల రూ.2,500, ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, ప్రతికుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇంటినిర్మాణం కోసం రూ.5లక్షలు, రైతులకు రూ.15వేల రైతు బంధు, విద్యార్థులకు రూ.5లక్షలతో విద్యాభరోసా, ప్రతి మండలంలో ఇంటర్నేషనల్ స్కూళ్లు, రూ.4,000 పెన్షన్, రూ.10లక్షలు ఆరోగ్యబీమా లాంటి పథకాలతో ఎన్నికల్లో ముందుకెళ్తున్నామన్నారు. సమావేశంలో తులసీరాజ్ యాదవ్, గంగాధర్‌గౌడ్, అయ్యూబ్‌ఖాన్, పరమేష్, నల్గొండ శ్రీను, మహేందర్‌రెడ్డి, విజయలక్ష్మి, రవీందర్, బాబు, మధు, ఈర్లదిన్నె శ్రీను, కేశవ్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

# దేవిశరన్నవ రాత్రులకు ఏర్పాట్లు పూర్తి



కొత్తకోటలో బతుకమ్మతో విద్యార్థినులు, అధ్యాపకులు

ఆత్మకూర్: దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకొని పట్టణంలోని శ్రీనీలకంఠేశ్వరస్వామి ఆలయం ఆవరణలో స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి మాతా ఆలయంలో శ్రీబాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో, కోట్లాంజనేయస్వామి, అష్టలక్ష్మి ఆలయంలో, వాల్మీకీనగర్‌లో ఏర్పాట్లు ముమ్మరంగా చేపడుతున్నారు. ఆదివారం ఉదయం మొదటిరోజు అమ్మవారు శ్రీబాలత్రిపుర సుందరీదేవిగా దర్శనమిస్తారని, 9 రోజులపాటు వివిధ రూపాల్లో అమ్మవారు కొలువుదీరనున్నారని నిర్వాహకులు తెలిపారు. ప్రతిరోజు బతుకమ్మ పూజలు, బొడ్డెమ్మలు, సహస్రకుంకుమార్చన, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

అమరచింత: దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకొని పట్టణంలోని కాళికామాత ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు. సమీపంలోని కృష్ణానది నుంచి పవిత్ర నది జలాలను జల్ది బిందెలతో శనివారం భక్తిశ్రద్ధలతో పట్టణానికి బాజాబజంత్రీల మధ్య తీసుకొచ్చారు. తొమ్మిది రోజుల పాటు నిర్వహించే దేవి నవరాత్రుల బ్రహ్మోత్సవాల సందర్భంగా నదీ జలాలతో అమ్మవారిని అభిషేకించారు. కార్యక్రమంలో క్యామ రాములు, మేర్వ రాజు, కృష్ణయ్యగౌడ్, కలకొండ చంద్రమౌళి, తాటికొండ రమేష్, సత్యనారాయణ చారి, కమ్మరి బ్రహ్మం, నాగయ్య, సూర్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా ఎంగిలి పూల బతుకమ్మ**

బతుకమ్మ సంబరాల్లో భాగంగా శనివారం ఎంగిలి బతుకమ్మ సంబరాలను ఘనంగా జరుపుకొన్నారు. రాంనగర్‌లో మహిళలు తీరొక్క పూలను పేర్చి బతుకమ్మను తయారు చేసి పూజలను నిర్వహించారు. అనంతరం ఆటపాటలతో బతుకమ్మ పాటలు పాడారు. అనంతరం చెరువులో నిమజ్జనం చేశారు.

కొత్తకోట: పట్టణ కేంద్రంలోని నివేదిత డిగ్రీ కళాశాలలో శనివారం బతుకమ్మ సంబరాలను విద్యార్థులు, లెక్చరర్లు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు తీరొక్క పూలతో బతుకమ్మను అలంకరించారు. లెక్చరర్లతో కలిసి బతుకమ్మ ఆటలు ఆడారు. కార్యక్రమంలో సహదేవుడు, సురిబాబు, గోవర్ధన్‌గౌడ్, రమేష్ పాల్గొన్నారు.



ఆత్మకూర్‌లో ప్రతిష్ఠకు సిద్ధంగా అమ్మవారి విగ్రహం



అమరచింతలో ..



అమరచింతలో జల్ది బిందెలతో నది జలాలు తీసుకొస్తున్న భక్తులు

### ప్రత్యేక పూజలు

పెంట్లవెల్లి: మండల కేంద్రంతో పాటు మంచాలకట్ట, మల్లేశ్వరం, గోపులాపూర్ గ్రామాలలో శనివారం అమావాస్య పురస్కరించుకొని ఆంజనేయస్వామి ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆంజనేయస్వామికి ప్రత్యేక ఆకుపూజ నిర్వహించి, అన్నదానం చేశారు. పెంట్లవెల్లిలోని ఆకుతోట ఆంజనేయ స్వామి, మంచాలకట్టలో అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రజలు ఆకుపూజ కార్యక్రమాన్ని చేపట్టారని అర్చకులు శివయ్యశర్మ, లోకేశ్వరయ్య తెలియజేశారు.